# ప్రతిబింబం

యర్రంశెట్టి శాయి

నరసింహం ఆఫీసు ముందు జీపు దిగాడు.

ప్యూన్ శ్రీరంగ పరుగుతో అతని కెదురొచ్చి, చేతిలోని లెదర్ బాగ్‌ని అందుకొని వెనకే నమ్రతగా నడవసాగాడు. తన ఆఫీస్ రూమ్ దగ్గరకొచ్చేసరికి అప్పటికే ఆఫీస్‌లోని మిగతా వారంతా ఎవరి సీట్లలో వారు కూర్చొనుండటం కనిపించింది. గర్వంగా నవ్వుకొని తన సీట్లో కూర్చున్నాడతను. తనొచ్చాకే ఈ ఆఫీసులో డిసిప్లిన్ మొదలయింది. అంతకు ముందు ఆ ఆఫీసెలా వుండేదో కొంతమంది తనకి చెప్పారు. పదింటికి ఆఫీసయితే అందరూ పదిన్నరకొస్తారట. వచ్చి కబుర్లు చెప్పుకొని, కాంటీన్‌లో ఓసారి 'టీ' తాగి వచ్చేసరికి పదకొండున్నర. ఓ పావుగంట ఫైల్స్ సర్ది లంచ్ కెళ్లిపోతారు. ఆ తరువాత రెండింటికి ఆఫీసులో అడుగు పెట్టి ఒకటో అరో ఫైలు చూసి నాలుగున్నరనుంచే ఇంటికి జారుకోవడం మొదలు పెడతారుట! తను ట్రాన్స్‌ఫర్‌లో వచ్చి జాయినయిన మొదటి రోజే పది గంటలకల్లా ఆఫీసులో అడుగు పెట్టి ఆ సమయానికి సీట్లోకి రానివాళ్ళందరికీ స్వయంగా తనే ఆబ్సెంట్ మార్కు వేశాడు. అంతే! అందరూ కాజువల్ లీవ్ అప్లయ్ చేయాల్సి వచ్చిందా రోజు. మర్నాటి నుంచీ తొమ్మిదీ ముప్పావుకే కలకలలాడిపోతోంది ఆఫీసు. మరో రోజు సరిగ్గా ఐదు గంటలకు రెండు నిమషాలుందనగా సెక్షన్‌లోకి నడిచి ఖాళీగా వున్న సీట్ల తాలూకు వాళ్ళందరికీ ఆబ్సెంట్ వేశాడు. అక్కడితో అందరూ దారికొచ్చేశారు. ఆ తరువాత 'డయిరీ' పద్ధతి ప్రవేశపెట్టాడు. ఏరోజు ఎవరెంత పని చేసిందీ, ఎన్ని ఫైల్స్ డీల్ చేసిందీ వ్రాయాలందులో.

ఆ పద్ధతి మంచి ఫలితాలనే ఇచ్చింది.

అయినాకాని వాళ్ళను కనిపెట్టే వుండాలి. తను అశ్రద్ధ చేశాడా వాళ్ళు తోక జాడించేస్తారు.

రమణారావ్ ఏదో ఫైలు తీసుకొని ఆ గదిలో కొచ్చాడు. ఫైలు నరసింహం ముందు వుంచాడు సంతకం కోసం.

నరసింహం ఫైలంతా తిరగేసి చూడసాగాడు. తను చూడకుండా ఎప్పటికీ సంతకం పెట్టడు. అన్నీ తెలుసుకోందే సంతకం పెట్టెయ్యటం తన కిష్టం లేదు. గుడ్డెద్దు చేలో పడ్డట్లు గుమాస్తాలు తయారుచేసిన నోట్లన్నిటికీ సంతకాలు పెట్టేస్తే జరిగేదేమిటో తనకు తెలుసు. వాళ్లు కంట్రాక్టర్ల దగ్గరా, వర్తకుల దగ్గరా లంచాలు తినేసి వాళ్ళకు చేయకూడని సహాయాలు చేస్తారు. అక్కడే తనకు ఏవగింపు కలిగేది.

హఠాత్తుగా ఓ ఆలోచన తట్టిందతనికి. ఇప్పుడీ రమణారావ్ కూడా లంచం తినే వుంటాడా? ఫైలంతా చూడటం ముగించేసరికి అతని అనుమానం మరింత బలపడింది. రమణారావ్‌ని మళ్ళీ పిలిపించాడతను.

"ఈ కాంట్రాక్టర్‌కి అనుకూలంగా నోట్ రాశావెందుకు?" అడిగాడతన్ని.

రమణారావ్ తొణక్కుండా జవాబిచ్చాడు "రూల్స్‌ప్రకారమే చేశానండీ."

★ పాఠాలు పాఠశాలలతో అంతం కావు. నేర్చుకొనే అవసరం ఉన్నప్పుడు ప్రకృతిలో ప్రతి వస్తువు ఏదో రకంగా మనకు పాఠం చెప్పగలుగుతుంది. జీవిత కాలమంతా విద్యార్థులమే మనం! ★

"ఓహో—అంతకంటే ఇంకేమీ కారణం లేదంటావ్?"

రమణారావ్ కతని మాటల్లోని వ్యంగ్యం అర్థమయింది. కోపం వచ్చిందిగానీ అణచేసుకొన్నాడు.

"ఇంకేముంటుందండీ?" ఎదురు ప్రశ్న వేశాడు.

"రమణారావ్! నా ప్రశ్నకు సమాధానం మరో ప్రశ్న కాదు. నువ్వు ఈ కంట్రాక్టర్ దగ్గర లంచం తినలేదని ఏమిటి గారంటీ?"

రమణారావ్‌కి ఉద్రేకం పొంగుకొచ్చింది.

"ఇందులో గారంటీలేముంటాయండీ? ఒకరినొకరు నమ్మాల్సిందే. నమ్మకం లేకపోతే వాళ్ళ ఖర్మ! అంతే"

"ఓహో! అలాగా! సరే! నేనిప్పుడు ఈ ఫైలుమీద సంతకం పెట్టను. అన్ని సంగతులూ వాటంతటవే ఎలా బయటకు రావో నేనూ చూస్తాను. .." కోపంగా అన్నాడు నరసింహం.

"సంతకం పెట్టకపోతే నాకొచ్చే నష్టం ఏమీ లేదు సార్! ఇది నా ఇంటిపని కాదు" విసురుగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు రమణారావ్!

బెల్ నొక్కాడు నరసింహం.

ప్యూన్ పరుగుతో వచ్చాడు.

"హెడ్ క్లర్క్‌ని పిలు...."

"అలాగే సార్...."

మరుక్షణంలో హెడ్‌క్లర్క్ సీతారామయ్య హడావుడిగా వచ్చాడు.

"చూడు సీతారామయ్యా! రమణారావ్ డీల్ చేసిన ఈ కేసు విషయంలో నాకు అనుమానంగా వుంది. నీ అభిప్రాయం ఏమిటి?" ఫైల్ అతని ముందుకు తోస్తూ అన్నాడు నరసింహం.

ఫైల్ చూసి వెంటనే గుర్తించాడు సీతారామయ్య.

"ఊహు! రమణారావ్ అలాంటివాడు కాదండీ! మీరనుమానపడనవసరం లేదు..."

"ఓహో...." తల పంకించాడు నరసింహం అతనికి కొత్త అనుమానం మొదలయింది. అంటే సీతారామయ్యకి కూడా లంచం ముట్టిందన్నమాట!

"మీకెంత ముట్టిందందులో?" అడిగాడు నరసింహం!

సీతారామయ్య అసహనంగా చూశాడు.

"మీరెంతనుకొంటే అంత!" అన్నాడు కోపంగా.

"సరే—మిమ్మల్నందర్నీ ఎలా దారికి తేవాలో నాకు తెలుసు" దహించుకుపోతూ అన్నాడు నరసింహం.

"నరసింహంగారూ! గుమాస్తా అయినంత మాత్రాన కక్కుర్తిపడాలనీ, నీతి నియమాలు అమ్ముకోవాలనీ ఎక్కడా లేదు. అలాగే ఆఫీసర్లయినంతమాత్రాన అందరూ ఆదర్శవంతులూ నీతిమంతులూ అవరు" అనేసి బయటకు నడిచాడతను.

సాయింత్రంవరకూ మరో రెండు మూడు ఫైల్స్ విషయంలో కూడా మరో నలుగురి మీద అనుమానం కలిగిందతనికి.

ఆ రోజు ఏ పనీ పూర్తికాలేదు. ఆఫీసంతా ఒకటయినట్లు అనిపించింది. ఆరింటికి ఆఫీస్‌లో నుంచి బయల్దేరబోయేముందు ప్యూన్ కొన్ని సర్టిఫికెట్లు, ట్రూ కాపీలు తీసుకొచ్చి ముందు వుంచేడు.

"మీ సంతకం కావాల్సార్..." అన్నాడు వినయంగా.

వాటిని చూడగానే ఠక్కున గుర్తుకొచ్చింది నరసింహానికి! ఈ ప్యూన్‌లకి ఇదో ఆదాయం. ఇలా ట్రూ కాపీస్ కావాల్సిన వాళ్ళందరి దగ్గరా ఒకటో రెండో తీసుకొని తమతో సంతకాలు చేయిస్తారు. సర్టిఫికెట్లిప్పిస్తారు. కేవలం వీటి వల్లే బోలెడు డబ్బు సంపాదించి బిల్డింగులు కట్టించిన ప్యూన్ ఒకడు తనకు తెలుసు!

"వాళ్ళ దగ్గర ఎంత తీసుకొన్నావ్?" అడిగాడు నరసింహం.

"ఇతను మా అన్నయ్య కొడుకే సార్!"

"ఇది మరో అబద్ధం! గెటవుట్! నేను చేయను...." విసిరేస్తూ అన్నాడు నరసింహం.

అతను ఆ కాగితాలన్నీ ఏరుకొని బయటకు వెళ్ళిపోయాడు.

జీప్‌లో ఇంటికి బయల్దేరాడతను.



"పెట్రోలు కొట్టించాలి సార్."

"నిన్నేగా కొట్టించిందీ?" ఆశ్చర్యంగా అడిగాడు నరసింహం.

"మరి రాత్రి మైలవరం వెళ్ళి రమ్మన్నారు కదండీ-అరవై కిలో మీటర్లది...."

"అంతేనా? లేక ఆయిల్ మళ్ళీ బంక్ వాళ్ళకు అమ్ముతున్నావా?" అడిగాడు నరసింహం.

"అవన్నీ అడగొద్దు సార్; జీప్ ఎంత దూరం తిరిగిందీ, ఎంత ఆయిల్ కాలిందీ చూసుకోండి. మీకే తెలుస్తుంది ..." కోపంగా అన్నాడు డ్రైవర్.

నరసింహం ఏమీ మాట్లాడలేదు. నమ్మకంగా బంక్ వాడి ద్వారానే వీడి రహస్యం లాగాలి అనుకొన్నాడు.

ఇంటికి చేరుకొనేసరికి ఎవరో ఓ యువకుడితో ఉత్సాహంగా మాట్లాడుతోంది అరుణ.

నరసింహం లోపలకురాగానే "నమస్కారమండీ!" అంటూ వినయపూర్వకంగా పలకరించాడా యువకుడు. అతనిని అంతకు ముందెక్కడా చూసిన గుర్తు లేదు నరసింహానికి. 'నమస్తే' అని పొడిగా అనేసి లోపలకు నడిచాడు. అరుణ చాలా సేపు ఆ యువకుడితోనే కబుర్లు చెబుతూ కూర్చుంది! నరసింహానికి అశాంతిగా వుంది. ఆ యువకుడెవరు? అరుణకు అతనితో అంతటి పరిచయం, చనువు ఎలా ఏర్పడినయ్? ఇంతకాలం తను చూడని ఉత్సాహం ఇప్పుడామెలో అకస్మాత్తుగా ఎందుకు ప్రవేశించింది?

అరుణ గదిలో కొచ్చింది.

"అతను మా క్లాస్‌మేట్ శాంత తమ్ముడండీ! మేము బి. ఏ.లో వుండగా అతను యస్సెల్సీలో వుండేవాడు. మన ఎదురింట్లోనే అద్దెకు దిగాడు. నన్ను చూసి గుర్తుపట్టి వచ్చి మాట్లాడుతూ కూర్చున్నాడు. రేపో మాపో అతని భార్యను కూడా తీసుకొస్తాడట ఆ ఇంట్లోకి."

నరసింహానికి మరింత అశాంతి కలుగ చేసినయ్ ఆమె మాటలు.

"నువ్వంటే అంత ప్రేమ కాబోలతనికి!" వికటంగా అన్నాడు.

అరుణ చురుగ్గా చూసిందతని వైపు.

అతని మాటలోని అంతరార్థం లీలగా కనిపించిందామెకి. ఇది మొదటిసారి కాదు! అతనికి అనుమానం జబ్బు ఉందన్న విషయం తను కాపరాని కొచ్చిన పదేళ్ళల్లోనూ చాలా సార్లు గమనించింది.

అనేక సందర్భాలలో అనేక రకాలుగా బయటపడిందది.

"ప్రేమేముంది? అక్కయ్యా స్నేహితురాలంటే ఆ మాత్రం గౌరవం, అభిమానం వుండవా?"

"అవన్నీ పైన పదాలు. వాటన్నిటికీ అంత

రార్థం ఒకటే—నువ్వంటే అతనికి ఇష్టం. మరి నీ ప్రోత్సాహం లేకుండా అతని కలాంటి అభిప్రాయం ఏర్పడిందంటే నేను నమ్మలేను."

అరుణ చివాలున లేచి నుంచుంది. ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

"ఇద్దరు పిల్లల తల్లినయిన నన్ను ఇంకా అనుమానిస్తున్నారంటే మిమ్మల్నేమనాలో అర్థం కావడం లేదు...." అనేసి అక్కడినుంచి వేగంగా వెళ్ళిపోయింది.

ఆ రోజునుంచీ ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చింది. రెండ్రోజుల తర్వాత మళ్ళీ శాంత తమ్ముడొచ్చాడు: "దయచేసి మా యింటికి రాకండి" అని చెప్పేసి లోపలకువెళ్ళి కన్నీరు పెట్టుకొంది. తను నరసింహంతో మాట్లాడడం తగ్గించివేసింది.

మొదట్లో ఆమె ప్రవర్తన ఫరవాలేదనిపించినా, రాన్రాను ఆమెతో సాన్నిహిత్యం లోపించడంవల్ల ఏదో వెలితిగా కనిపించసాగిందతనికి. అయినాగాని తప్పలేదు. ఏలాగోలా ఈ వెలితి భరించడమే మంచిదనిపించింది.

ఓరోజు తన కొడుకు రవి స్కూలునుంచి ఇంటికొచ్చేప్పుడు ఐస్‌క్రీమ్ తింటూ తనకంట పడ్డాడు. ఇంటి దగ్గర వేచివుండి వాడురాగానే చావబాదేడు నరసింహం.

"నిజం చెప్పు ఐస్‌క్రీమ్ ఎక్కడిది నీకు?"

"మా ఫ్రెండ్ కొనిచ్చాడు."

"అబద్ధం! నువ్వు నా జేబులోనుంచి డబ్బు దొంగిలించావు కదూ?"

"ఊహు! లేదు నాన్నా! మా ఫ్రెండ్...."

నరసింహం అతని మాటలు వినిపించుకోలేదు. చావబాదేడు. ఆ రోజునుంచీ వాడికి తండ్రంటే ఏహ్యభావం కలిగింది. అదివరలా అతని దగ్గరకు రావడం, మాట్లాడడం మానివేశాడు. ఓరోజు నరసింహం స్నేహితుడు విశ్వనాథం వచ్చాడు.

"నాకో సహాయం చేయాల్రా!" దీనంగా అడిగాడు విశ్వనాథం.

"ఏమిటది?" అడిగాడు నరసింహం.

"మా సిస్టర్ మారేజ్ చేస్తున్నాను. నా దగ్గరున్న డబ్బు చాలేట్లు లేదు. ఓ పదివేల రూపాయల సర్దావంటే వచ్చే నెలలో లోన్ తీసుకొని నీ బాకీ తీర్చేస్తాను."

"డబ్బా!" తేలిగ్గా మాట్లాడాడు నరసింహం.

"అవున్రా! మనవాళ్ళందరూ గడ్డు పరిస్థితుల్లోనే వున్నారు. అందరూ నీదగ్గర కెళ్ళమనే సలహా యిచ్చారు."

నరసింహం ఆలోచనలోపడ్డాడు. తన దగ్గర డబ్బుంది. అతని క్కావలసిన పదివేలూ తేలిగ్గానే ఇవ్వవచ్చు. కాని ఇస్తే ఆ డబ్బు తిరిగి వస్తుందా? ఒకవేళ వాడు తిరిగి ఇవ్వకపోతే తనేం చేయగలడు? అసలు తనిచ్చినట్లు ఋజువులేముంటాయ్? అంతలోనే విశ్వనాథంతో ఎంతో కాలం నుంచీ తనకున్న స్నేహం గుర్తుకొచ్చింది. నిజమే! తనకి వాడు ప్రాణ స్నేహితుడే! ఎన్నోసార్లు వాడిమూలాన తను ఎన్నో సహాయాలు పొందాడు! తను అడిగినప్పుడల్లా డబ్బు కూడా అవసరాలకి సర్దాడు. ఒకవిధంగా చెప్పుకోవాలంటే వాడు ధన సహాయం చెయడంవల్లే తనీ ఉన్నత పదవి సంపాదించుకోగలిగాడు. ఈరోజు వాడి పరిస్థితి కొంచెం దెబ్బ తినడంవల్ల తన దగ్గరకొచ్చాడు. నరసింహం ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు.

"ఏమిట్రా—ఆలోచనలో పడ్డావ్! డబ్బు లేదా? లేకపోతే పోనీలే! మరోచోట ప్రయత్నిస్తాను."

నరసింహం ఎటూ చెప్పలేక చిన్నగా నవ్వాడు.

అతను లేచి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోతూంటే నరసింహం బాధపడ్డాడు. తను తప్పు చేస్తున్నాడు. తనకు తెలుసు. తన ప్రాణస్నేహితుడిని మోసం చేశాడు. కానీ....తీరా తను సహాయం చేశాక అతగాడు అది మర్చిపోతే? అప్పుడు విచారించడంకన్న ఈ బాధే మంచిదేమో!

వారం రోజుల తర్వాత విశ్వనాథం చెల్లెలి పెళ్లి చాలా వైభవంగా జరిగింది. పెళ్ళికి తనూ వెళ్ళక తప్పలేదు నరసింహానికి. కానీ అక్కడ స్నేహితులందరితోనూ అదివరలా చనువుగా

## (వి) చిత్ర విజ్ఞానం



సిగరెట్ పొగలో రెండు వాయువులున్నాయి. అవి నైట్రజన్ డై ఆక్సైడ్, హైడ్రజన్ సయనైడూ! ఈ రెండూ ఊపిరితిత్తులకు తీవ్రమైన హానిని కలిగించి "ఎంఫైసిమా" అనబడే వ్యాధికి దారితీస్తాయి. అమెరికాలోని "ఓష్నర్ క్లినిక్" లో ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులమీద పరిశోధనలు జరుపుతున్న డా॥ హర్స్ట్ హోచ్ రోజూ రెండు పాకెట్లకు మించి సిగరెట్లు తాగే వారికి యీ వ్యాధి సంభవించే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. నైట్రజన్ డై ఆక్సైడ్, హైడ్రజన్ సయనైడులను మొదటి ప్రపంచ యుద్ధంలో విష వాయువులుగా ఉపయోగించారు॥

---

మసలలేకపోయాడు. అదీగాక రాఘవగాడు అననే అనేశాడు కూడా "కొంతమంది చాలా తెలివిగలవాళ్ళయిపోయార్రా యీమధ్య! డబ్బు వుంచుకుని లేదు బొమ్మనేస్తున్నారు. వాళ్ళ బాంక్ బాలెన్స్ సంగతి మనకు తెలీదనుకొంటున్నారు కాబోలు—అయినా నాకు తెలీకడుగుతాను, ఇలా పోగుజేసి, చేసి చివరకు ఏం సాధిద్దామని?"

ఆ మాటతో తనకు తల కొట్టేసినట్టయింది. విశ్వనాథాన్ని పిలిచి క్షమించమని అడగాలనుకొన్నాడు. కానీ ఏదో తెలీని బలహీనత అతనిని అలా చేయనీకుండా అడ్డుపడింది. ఆ తరువాత అతను కనిపించినా చూడనట్లు తప్పించుకుపోసాగారందరూ.

రాన్రాను నరసింహానికి జీవితం అసంతృప్తిని కలిగించసాగింది.

తన భార్య తనతో మనసు విప్పి మాట్లాడదు.

తన కొడుకు అసలు తనతో మాటాడడానికే ఇష్టపడడు.

తన కూతురుకి తనని చూస్తేనే భయం!

తన జీప్ డ్రైవర్‌కి తనంటే నిర్లక్ష్యం.

ప్యూన్‌కి అసహ్యం!

ఆఫీసు స్టాఫందరికీ తనంటే ద్వేషం.

స్నేహితులకి అయిష్టం—

ఏమిటీ దారుణం?

తను అందరిలాంటివాడు కాదూ? తనలో మానవత్వం లేదూ?

తన కుటుంబమంటే తనకి ప్రేమ లేదూ?

తన స్నేహితులను తను ప్రేమించడం లేదూ?

అయినా అందరూ తనమీద ఎందుకిలా కత్తి కట్టారు? ఈ ఆలోచనలు ఎక్కువవుతున్న కొద్దీ అశాంతి పేరుకుపోసాగిందతన్లో. ఆఫీసులో ఒక్క కాగితం కూడా కదలడం లేదు. అసలు ఆఫీసు కెళ్ళడానికూడా మనస్కరించడం లేదతనికి.

రెండు నెలలు సెలవు తీసుకొని ఇంట్లో కూర్చున్నాడు నరసింహం. తను మరో రెండేళ్ళలో రిటయిరవుతున్నాడు. ఆ తరువాత తన

బ్రతుకేమిటి? ఆఫీసువాళ్లెవరయినా రోడ్డుమీద కనబడితే ఉమ్మి వేయరూ? మంచాన్న బడితే భార్యా పిల్లలు విసుక్కోరూ? చీదరించుకోరూ? స్నేహితులు వేళాకోళం చేయరూ?

నరసింహం ఆలోచనల్లో కృంగిపోసాగాడు. తన గదిలో కిటికీ దగ్గర కూర్చుని ఇరవై నాలు గ్గంటలూ ఎడతెరిపి లేకుండా ఆలోచించడమే అతని దినచర్య.

నెల రోజులు గడిచిపోయినయ్.

ఆ రోజు అతని గదిలోని అద్దం దగ్గరకు ఓ పిచ్చుక వచ్చి అరుస్తూ అద్దంలోని తన ప్రతిబింబాన్ని పొడవటం కనిపించిందతనికి.

అతనికి ఆశ్చర్యం వేసింది.

అది తన ప్రతిబింబమేనని దానికి తెలీదూ? మరెందుకలా శత్రువులా పొడుస్తుంది? నిజానికి అక్కడ మరో పిచ్చుక లేదనీ అదంతా తన భ్రమ అనీ దానికి ఎందుకు అర్థం కావటం లేదూ?

లేచి ఆ పిచ్చుకని బయటకు తరిమేశాడు నరసింహం. అయిదు నిముషాలన్నా అవక ముందే మళ్ళీ అద్దం ముందు చేరిందది.

మరేమీ చేయలేక దానివంకే చూస్తూండి పోయాడతను.

చీకటి పడిపోతోంది.

పిచ్చుక పూర్తిగా అలసిపోయి ఒగరుస్తూ నిలబడింది.

హఠాత్తుగా నరసింహం మస్తిష్కంలో మెరుపు మెరిసినట్లయింది. అవును! తనూ, ఆ పిచ్చుకా ఒక్కటే!

అది తనప్రతిబింబాన్నే పొడుచుకుంటోంది.

తనూతన ప్రతిబింబాన్నే పొడుచుకొన్నాడు.

తను తన భార్యను నమ్మలేదు. తన పిల్లలను నమ్మలేదు. తన స్నేహితులనూ, తన కొలీగ్స్‌నీ, తనక్రింద పనిచేసేవారినీ ఎవ్వరినీ నమ్మలేక పోయాడు. అందుక్కారణం అసలు తనమీద తనకి నమ్మకం లేకపోవడమే. అదే తన ప్రతి బింబం! దాన్ని పొడిచే అందరికీ దూరమయి ఒంటరిగా ఒగరుస్తూ నిలబడ్డాడిప్పుడు. నరసింహం లేచి పిచ్చుకను తరిమి అద్దం మీద పెద్ద గుడ్డపరచేశాడు. □


# శ్రీ బాలాజీ వైద్యశాల



## సెక్సుస్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఎ. పి.)

బ్రాంచి: 26, నార్తుబోగ్ రోడ్, మద్రాసు-17.

## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నములు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం -రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండా బాగుచేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

బ్రాంచీలు:-తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.